ఎడగారుకు సాగునీరందేనా?

- ఐఏబీలో ఉత్తరకాలువ 50వ కిలోమీటరు వరకు తీర్మానం
- ప్రస్తుతం 375 క్యూసెక్కులు మాత్రమే విడుదల
- బ్రాంచ్‌కెనాళ్లకు పూర్తిస్థాయిలో అందని సాగునీరు
- ఎండిపోతున్న నారుమడులు
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు



సాగునీరందని పొలాలను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



పాతాళపల్లి వద్ద ఉత్తరకాలువలో తక్కువగా ఉన్న నీటి ప్రవాహం

సోమశిల: సోమశిల ఉత్తరకాలువ ద్వారా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ఉత్తరకాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో బ్రాంచ్‌కాలువలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడంలేదు. దీంతో ఉత్తర కాలువ ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల్లోని చివరి పొలాలకు సాగునీరు చేరడం లేదు. ఫలితంగా నారుమడులు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐఏబీలో 50వ కిలోమీటర్ వరకు తీర్మానం

ఐఏబీ సమావేశంలో ఉత్తరకాలువకు సాగునీరు అందించాలని తీర్మానించారు. ఉత్తర కాలువ 50 కిలోమీటర్ వరకు రెండో పంటను సాగుచేసుకోవాలని ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు సూచించారు. దీంతో అనంతసాగరం, ఆత్మకూరు మండలాల్లోని రైతులు రెండో పంట సాగుకు నారుమడులు పోసుకున్నారు. ప్రస్తుతం ఉత్తరకాలువకు 375 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని అధికారులు చెబుతున్నా బ్రాంచ్‌కాలువలకు సాగునీరు అందడం లేదు. అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు, పాతాళపల్లి, వరికుంటపాడు, ఉప్పలపాడు, గోవిందంపల్లి, చిలకలమర్రి, గౌరవరం, వెంగంపల్లి, గార్లదిన్నెపాడు, ముత్తుకూరు, రేవూరు, శంకర్‌నగరం, తదితర గ్రామాలకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉత్తర కాలువలో నీటి ప్రవాహం బ్రాంచ్‌కాలువల తూముల వరకు లేని కారణంగా ఈ పరిస్థితి నెలకొంటోందని రైతులు చెబుతున్నారు. జలాశయం నుంచి 375 క్యూసెక్కులను పూర్తిస్థాయిలో విడుదల చేసి ఉంటే కనీసం నారుమడులైన తడుస్తాయని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, నారుమడులు కూడా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా సాగునీటి కాలువలపై ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో బోర్ల కింద ముందస్తుగా ఎడగారు సాగుచేసిన రైతులు సాగునీటిని పారించుకుంటూ దిగువకు విడుదల చేయడం లేదు. రేవూరులోని మునగళ్ల కాలువ నుంచి వచ్చే చీలు కాలువ ఆయకట్టు పొలాలకు సాగునీరు రానీయకుండా సాగునీటి హక్కు లేని బోర్ల కింద పండించుకునే రైతులు కాలువ షట్టర్లు దించేసి మోటార్ల సాయంతో దొంగతనంగా సాగునీటిని తమ పొలాలకు పెట్టుకుంటున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోని కారణంగా ఆయకట్టు పొలాలు సాగునీటికి నోచుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముత్తుకూరు, వెంగంపల్లి గ్రామాలకు చెందిన రైతులు సాగునీరందడం లేదని ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తే మేము వచ్చి చేసేది ఏమీ లేదని, కాలువకు అడ్డుగా ఆనకట్ట వేసుకుని నీరు పెట్టుకోమని చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆనకట్ట వేసుకుంటే దిగువ రైతులు వచ్చి గొడవకు దిగి కట్టను తీసేస్తున్నారని, ఇరిగేషన్ అధికారులే మళ్లీ వచ్చి కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇలా రైతుల మధ్యన గొడవ పెట్టడం మంచిది కాదని, వీలైనంత వరకు ప్రతి రైతుకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందుతుందనే నమ్మకం లేదు
–మద్దల మల్లికార్జునరెడ్డి, పాతదేవరాయపల్లి



నేను ఉత్తరకాలువ కింద ఏడెకరాలు కౌలుకు తీసుకున్నా.రెండో పంట సాగుకు నారుపోసేందుకు సిద్ధమయ్యా. మా పక్క పొలాల వారు డ్రమ్‌సీడర్‌తో ఎడగారు సాగుచేసేందుకు సాగునీటి కోసం నానా అవస్థ పడడం గమనించి ముందే జాగ్రత్తపడి నారుమడి పోయడం మానుకున్నా. సాగుచేపట్టిన వారికి చివరి వరకు సాగు నీరు అందుతుందనే నమ్మకం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం
–ఎస్‌కే మస్తాన్ బాబు, వెంగంపల్లి రాయపల్లి



ఆరెకరాలు సాగుచేసేందుకు నారుపోసుకున్నా. తీరా నాటే సమయానికి సాగునీరు అందలేదు. సాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇలా అధికారులు రైతులను ఇబ్బందులు పెట్టడం మంచిది కాదు. మొదట్లోనే సాగునీరు అందించలేమని చెబితే సాగుకు విరామం ఇచ్చే వాళ్లం. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సరిపడా నీరు అందించాలి.

ఆందోళనగా ఉంది
సద్దా వినోద్, ముత్తుకూరు



నేను 8 ఎకరాలకు నారుమడి పోశా. ప్రస్తుతం నీరందకపోవడంతో ఆందోళనగా ఉంది. ఎలా సాగు చేపట్టాలో అర్థం కావడం లేదు. ఉత్తరకాలువ కింద నార్లు పోసిన నాలాంటి రైతులు చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఉత్తరకాలువలో నీటి ప్రవాహాన్ని పెంచి రైతుల కష్టాలు తీర్చాలి.

క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

- ఎన్‌హెచ్‌ఏఐ పీడీకి మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి లేఖ

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఎన్‌హెచ్‌ఏఐ పీడీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ముంబై జాతీయరహదారిపై సరైన ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, పటిష్టమైన భద్రతా చర్యలు లేనందున వరుసగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రజలు విలువైన ప్రాణాలు కోల్పోవడంతో పాటు క్షతగాత్రులై ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. సైన్ బోర్డులు, రోడ్డు మార్కింగ్, ప్రత్యేక లైటింగ్, జంక్షన్ల వద్ద సరైన సూచికలు లేకపోవడం, తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుని జాతీయ రహదారిపై లోటుపాట్లను సరిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్: సున్నంవారిచింతలలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు సీతారాముల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. తొలిరోజు ఉదయం విశేష పూజలు, రాత్రికి గ్రామోత్సవం, శనివారం ఉదయం సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం వసంతోత్సవం, పారువేట, పొంగళ్లతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

కావలి (జలదంకి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని విశ్రాంత అధ్యాపకుడు ఎంవీఎస్ ప్రసాద్‌రావు అన్నారు. కావలి పట్టణంలో మీకోసం స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఉన్న బ్లెస్‌డ్ హోమ్‌లో పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఫైళ్లు, హాట్‌బాక్సులను గురువారం ఆయన వితరణ చేశారు. సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయిని చంద్రిక, మీకోసం సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయపాటి దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు శేషగిరిరావు, లలిత పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

అల్లూరు: ఎడగారు సాగుచేసే రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇరిగేషన్ ఏఈ సుధీర్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. అల్లూరు చెరువు, రామన్న చెరువు, మోపూరు మట్టం కింద 12 రోజులకు ఒక తడి చొప్పున నీరు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల బాధ్యతల స్వీకరణ

వింజమూరు(ఉదయగిరి): ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్టుకు కొత్తగా బదిలీపై వచ్చిన ముగ్గురు సూపర్‌వైజర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టులో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు బదిలీపై ఆత్మకూరు, కావలికి వెళ్లారు. వారి స్థానాల్లో కావలి నుంచి సుహాసిని, ఉదయగిరి నుంచి తేజస్విని, ఆత్మకూరు ప్రాజెక్ట్ నుంచి నాగేశ్వరమ్మ బదిలీపై వచ్చారు.

నేటి నుంచి మానసాదేవి బ్రహ్మోత్సవాలు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలో కొలువైన మానసాదేవి ఆలయంలో 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. చల్లా వంశస్తుల ఆధ్వర్యంలో తొలిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, సహస్ర దీపాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 21న ఉదయం గణపతి పూజ, మానసాదేవి హోమం, చండీ హోమం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, 22న వాల్మీకి పూజ, సహస్రనామార్చన, కుంకుమార్చన, పొంగళ్లు నిర్వహించనున్నట్లు వివరించారు.

నల్లగొండ్ల క్షేత్రాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఉదయగిరి, పర్చూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, వేలూరి సాంబశివరావు గురువారం దర్శించుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ లెక్కల చినకొండారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ కనెక్షన్లకు వేకువజామున 4 గంటల నుంచి సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు.

సబ్‌జైలులోని బాధితులను పరామర్శించిన రామిరెడ్డి



సబ్‌జైలులోని బాధితులను పరామర్శించి బయటకొస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి,నాయకులు



నాగేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): కావలి సబ్‌జైలులో ఉన్న పలువురు బాధితులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ములాఖత్ ద్వారా గురువారం కలుసుకుని పరామర్శించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారన్న కారణంతో వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు ఆత్మకూరి రాజేష్, దళిత జర్నలిస్టు దామెర్ల శ్రావణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి సబ్‌జైలులో ఉంచగా వారిని రామిరెడ్డి పరామర్శించారు. అలాగే ఇటీవల బోగోలు పంచాయతీ పరిధిలోని కడనూతలకు చెందిన వైఎస్సార్‌సీపీకి చెందిన నాటకరాణి వెంకట్రామయ్య, బాబుపై టీడీపీ నాయకులు మారణాయుధాలతో దాడులకు పాల్పడి తిరిగి వారిపైనే కేసులు నమోదు చేయించి జైలుకు పంపగా, బాధితులను ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం రాజేష్ కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ తరుపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే కావలి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, సీనియర్ జర్నలిస్టు ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల గుండె పోటుతో మరణించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అలాగే 3వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మండలి కృష్ణారావు తల్లి ఇటీవల మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను రామిరెడ్డి పరామర్శించారు.ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, మద్దిబోయిన వీరరఘు, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సుందరరాజు ఉన్నారు.

డీసీపల్లిలో 627 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 627 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 841 బేళ్లు రాగా, 627 బేళ్లను విక్రయించామని చెప్పారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.219.02 ధర పలికిందని వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 580 బేళ్లను వేలానికి తీసుకురాగా, 344 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ. 280, కనిష్టంగా రూ.180, సరాసరిన రూ.245.40 ధర పలికిందని వివరించారు.

144 యోగా కేంద్రాల ఏర్పాటు

సోమశిల: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతసాగరం మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 144 యోగా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ గురువారం తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి విద్యార్థులు, ప్రజలతో కలిసి యోగా ఆసనాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు. అనంతసాగరం జెడ్పీ హైస్కూల్‌లో యోగా దినోత్సవ ఏర్పాట్లను ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డి, ఏఓ, హెచ్‌ఎంలు పరిశీలించారు.

అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర ఏర్పాట్లపై ఎంపీడీఓ రజనీకాంత్ యోగా గురువులు మల్లికార్జున, కొప్పు శ్రీనివాసులు, ఏటూరి హరిరెడ్డితో గురువారం సమీక్షించారు.

చిన్నారులను ప్రీస్కూల్‌లో చేర్పించాలి

వింజమూరు(ఉదయగిరి): మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ ప్రీస్కూల్‌లో చేర్పించి వారి సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీలు దోహదపడాలని ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మజాకుమారి అన్నారు. వింజమూరులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీలకు ప్రీస్కూల్ పిల్లలకు సంబంధించిన పీపీ–1, 2 పుస్తకాలు గురువారం ఆమె పంపిణీ చేశారు. మూడేళ్లు నిండిన పిల్లలకు పీపీ–1 పుస్తకాలు, నాలుగేళ్లు నిండిన పిల్లలకు పీపీ–2 పుస్తకాల ద్వారా విద్యాబోధన చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చర్మిస్టా, సుహాసిని, తేజస్విని, నాగేశ్వరమ్మ, సుజాత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ప్రదర్శిస్తున్న సీడీపీఓ, అంగన్‌వాడీలు

గడ్డివామి దగ్ధం

ఆత్మకూరురూరల్: వెన్నవాడలో పసుపులేటి చెంచయ్యకు చెందిన గడ్డివామి సమీపంలోని విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు ఎగిసిపడడంతో గురువారం దగ్ధమైంది. ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. పాడి పశువుల కోసం మూడెకరాల్లోని రూ.30వేల విలువచేసే గడ్డిని వామిగా వేసుకున్నామని, ప్రమాదవశాత్తు కాలిపోవడంతో మూగజీవాలకు మేత లేకుండా పోయిందని బాధిత రైతు ఆవేదన చెందారు.

విద్యాభివృద్ధికి సహకారం అందిస్తాం



ఆత్మకూరురూరల్: శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని దాత కంచి పరమేశ్వరరెడ్డి అన్నారు. చెర్లోయడవల్లి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెర్లోయడల్లి ఉన్నత పాఠశాలకు నాగులపాడు, నారంపేట పరిసర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఆటో సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పరమేశ్వరరెడ్డిని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

దూషించారని ఫిర్యాదు

సంగం: స్థానిక శ్రీనివాస నర్సింగ్‌హోమ్‌కు వచ్చిన ఓ దళితుడిని ఇద్దరు వ్యక్తులు దూషించడంపై సంగం పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. వివరాలు.. ఉడ్‌హౌస్‌పేట గ్రామానికి చెందిన ఉక్కాల వెంకటాద్రి దళితుడు. అతని మనుమరాలికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం ఉదయం సంగంలోని శ్రీనివాస నర్సింగ్‌హోమ్‌కు చెందిన వైద్యుడు డాక్టర్ ఐవీ కృష్ణారెడ్డి వద్దకు తీసుకొచ్చారు. ఆ సమయంలో నర్సింగ్ హోమ్ వీధికి అడ్డంగా నిర్మాణం చేపడుతున్న అన్నదమ్ములు మాల్యాద్రి, కిషోర్‌ను డాక్టర్ ఐవీ కృష్ణారెడ్డి నిర్మాణం నిలిపివేయాలని కోరగా వారు అమర్యాదగా మాట్లాడారు. అలా మాట్లాడడం తప్పని భావించిన వెంకటాద్రి జోక్యం చేసుకుని గౌరవప్రదమైన డాక్టర్‌ను అమర్యాదగా మాట్లాడడం సరికాదని నచ్చజేప్పేందుకు ప్రయత్నించారు. దీంతో అన్నదమ్ములు తనను కులం పేరుతో దూషించడమే కాకుండా వెనక్కునెట్టారని వెంకటాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని సంగం పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా రాజు



కోమారి రాజు

కావలి (జలదంకి): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కావలి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోమారి రాజును రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. అన్నగారిపాలెం పంచాయతీ పరిధిలోని తుమ్మలపెంట పట్టపుపాళేనికి చెందిన కోమారి రాజుకు మత్స్యకార నేతగా మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు రాష్ట్ర స్థాయి పదవి కల్పించడంపై కావలి నియోజకవర్గ నాయకులతో పాటు పలువురు కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు సహకరించిన కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి తాను రుణపడి ఉంటానని తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన హజరత్తయ్య

అనుమసముద్రంపేట: స్థానిక వినాయకసెంటర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..వింజమూరు మండలం నందిగుంటకు చెందిన హజరత్తయ్య బైక్‌పై ఏఎస్‌పేట మండలం పందిపాడుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఏఎస్‌పేటలోని వినాయకసెంటర్ వద్ద అదుపుతప్పి చర్చి గోడను వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో హజరత్తయ్య తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. ఏఎస్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

బైక్ అదుపుతప్పి వైఎస్సార్‌సీపీ నాయకుడికి..

కావలి (జలదంకి): బైక్ అదుపు తప్పడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు పరుసు మాల్యాద్రి గాయాల పాలైన ఘటన గురువారం జరిగింది. జలదంకి మండలం ఎల్‌ఆర్‌అగ్రహారం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పరుసు మాల్యాద్రి కావలిలో నివాసం ఉంటున్నారు. ఆయన ద్విచక్ర వాహనంపై ఎల్‌ఆర్‌అగ్రహారం వెళ్లి కావలికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బుడంగుంటకాలనీ సమీపంలో వాహనం అదుపుతప్పడంతో కిందపడిపోయి గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైద్యశాలకు వెళ్లి మాల్యాద్రి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

డయేరియా నివారణపై ప్రత్యేక దృష్టి



కలిగిరి: పిల్లల్లో డయేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. కలిగిరి పీహెచ్‌సీలో డయేరియా నివారణపై అవగాహన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ వచ్చే నెలాఖరు వరకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యారోగ్య సిబ్బంది ఐదేళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారన్నారు. సీహెచ్ఓఎస్ సాయిలక్ష్మి, స్టాఫ్‌నర్స్ స్వప్న, వైద్యసిబ్బంది నారాయణరాజు, కృష్ణయ్య, పద్మ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల అభివృద్ధికి సహకారం అందించండి

- టీటీడీని కోరిన యూడీఎఫ్

ఉదయగిరి : ఉదయగిరి నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా సహకారం అందించాలని ఉదయగిరి అభివృద్ధి ఫోరం ప్రతినిధులు మీఎస్‌ఆర్ మూర్తి, ఎండీ ఖాజా కోరారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం లేఖ రాసారు. నర్రవాడలోని వెంగమాంబ ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం టీటీడీ వసతి గృహం, సత్రాలు నిర్మించాలని, ఉదయగిరిలోని టీటీడీ కల్యాణ మండపాన్ని ఆధునీకరించి తగిన సౌకర్యాలు కల్పించి ఉపయోగంలోకి తేవాలని కోరారు. ఉదయగిరిలోని శ్రీరంగనాయకులస్వామి ఆలయాన్ని పునరుద్ధరించాలని, నల్లగొండ్ల, సిద్దేశ్వరం, భైరవకోన క్షేత్రాల అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కాయ్ రాజా కాయ్

- వెంగమాంబ తిరునాళ్లలో యథేచ్ఛగా డైమండ్ డబ్బా జూదం
- కన్నెత్తి చూడని పోలీసులు
- రూ.లక్షల్లో చేతులు మారిన వైనం
- జేబులు ఖాళీ చేసుకుని లబోదిబోమన్న భక్తులు
- జోరుగా మద్యం విక్రయాలు

మద్యం పరవళ్లు

వెంగమాంబ తిరునాళ్ల సందర్భంగా బుధ, గురువారాల్లో భక్తులకు అందుబాటులో మద్యం ఉంచడంలో ఎక్సైజ్ అధికారులు విజయం సాధించారు. ఏటా నిబంధనల మేరకు తిరునాళ్లలో ప్రధాన ఘట్టాలైన కల్యాణోత్సవం, బండ్ల పొంగళ్లకు 24 గంటల ముందే స్థానికంగా ఉన్న మద్యం షాపులను సీజ్ చేసి మూసివేయించే వారు. కానీ ఈ దఫా అందుకు భిన్నంగా మద్యం వ్యాపారులు పలుచోట్ల తాత్కాలికంగా కేంద్రాలను ఏర్పాటు చేసి పవిత్రమైన వెంగమాంబ సన్నిధిని మందుబాబులకు నిలయంగా మార్చా రు. ఉదయగిరి ఎక్సైజ్ సీఐ అధ్వర్యంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినా మద్యం అమ్మకాలు ఆపలేదు. దీంతో అధికారులే దగ్గర ఉండి మద్యం అమ్మకాలను జరిపించారని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉదయగిరి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు తిరునాళ్లలో బుధవారం రాత్రి మద్యం పరవళ్లు తొక్కింది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ గుడికి అతి సమీపంలో ఉన్న చెరువుకట్టపై డైమండ్ డబ్బాల గలగలలు తాండవం చేశాయి. ఎందరోభక్తులు జూదగాళ్ల వలలో చిక్కుకుని పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకుని జేబులు ఖాళీ చేసుకుని లబోదిబోమంటూ కనిపించారు. పోలీసులు పెద్ద సంఖ్యలో ఆలయ పరిసరాల్లో గస్తీ తిరుగుతూ చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టడం కనిపించింది. కానీ అక్కడే లాంతర్ల వెలుగుల మధ్య సాగుతున్న జూదం జోలికి ఒక్క పోలీసు అధికారి కూడా వెళ్లలేదు. మొబైల్ వ్యాన్‌లో గస్తీ నిర్వహిస్తున్న ఓ పోలీసు అధికారి (ఎస్సై) డైమండ్ డబ్బా కేంద్రాలను మూసివేసేందుకు ప్రయత్నించగా నిర్వాహకులు అతనితో వాగ్వాదానికి దిగారు. 'మేము లోకల్ పోలీస్ అధికారులకు రూ.లక్షల్లో మామూళ్లు ఇచ్చి జూదం నిర్వహిస్తున్నాం..కావాలంటే వారితో మాట్లాడండి..అంతేగాని మా జోలికి వస్తే సహించం' అంటూ అందరూ చూస్తుండగానే సదరు అధికారికి వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఆయన ఏమీ చేయలేక చల్లగా జారుకున్నారు. చెరువుకట్టపై దాదాపు 30 చోట్ల సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన జూదం తెల్లవారే వరకు సాగింది. ఇదే మార్గంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో పాటు అమ్మవారి దర్శం కోసం వచ్చిన పలువురు వీఐపీలు పోలీసు క్యానాయ్‌తో పలుమార్లు వెళ్తున్నా జూదరులు మాత్రం యథేచ్ఛగా తమ కేంద్రాలను కొనసాగించారు. గతంలో చాటుమాటున ఎక్కడో దూరంగా ఒకటి..రెండు చోట్ల మాత్రమే జూదం నిర్వహించే వారని, అమ్మవారి గుడి వద్దే తొణుకు బెణుకు లేకుండా అధిక సంఖ్యలో కేంద్రాలు ఏర్పాటు చేసి జూదం ఆడించడం ఇదే మొదటిసారి అని పలువురు భక్తులు వాపోయారు. జూదాల నిర్వహణను కట్టడి చేయాల్సిన పోలీసులు, ఆలయ కమిటీ పెద్దలు పట్టించుకోకపోవడంపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కడప, బద్వేలు, పామూరు ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ జూదం నిర్వహించారు. వీరికి పోలీసులకు కడప, పామూరు చెందిన ఇద్దరు వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరించినట్లుగా సమాచారం.



చెరువుకట్టపై డైమండ్ డబ్బా నిర్వహిస్తున్న దృశ్యం

పన్నులను సకాలంలో వసూలు చేయాలి

ఉదయగిరి రూరల్: ఇంటి, కుళాయి పన్నులను సకాలంలో వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి పంచాయతీకార్యదర్శులు కృషి చేయాలని ఆత్మకూరు డీఎల్‌పీఓ షేక్ నయూం అన్నారు. మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామ పంచాయతీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి ఏ వెంకట్రామయ్య ఉన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

వింజమూరు(ఉదయగిరి): కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను వింజమూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి పంచారు.